క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచండి

పిడుగురాళ్ల రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి అధికారి ముందుగానే జాగ్రత్తలు పాటించాలని, ప్రజలకు అవగాహన పెంచాలని పిడుగురాళ్ల, కరాలపాడు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కె. ప్రభావతి, కేవీ ప్రవీణ్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు 'స్టాప్ డయేరియా'పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంచడం, వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాగునీటి విషయం పలు సూచనలు అందించారు. టైఫాయిడ్, డెంగీ, మలేరియా, డయేరియా లక్షణాలు, వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారావు, పంచాయతీ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మెటా డీఏపీ



కారెంపూడి : సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మేలైన దిగుబడులు సాధించవచ్చని స్థానిక గ్రోమోర్ సెంటర్ ఏఎంఎం జాకీర్ పేర్కొన్నారు. గ్రోమోర్ సెంటర్‌లో శనివారం మెటా డీఏపీ, గ్రోవైట్ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఒప్పిచర్ల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పి. రవి చేతుల మీదగా నూతన ఉత్పత్తులను ఆవిష్కరించి, రైతులకు పంపిణీ చేశారు. సేంద్రియ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు గ్రోమోర్ చేస్తున్న కృషిని ఏఎంఎం జాకీర్ రైతులకు వివరించారు. భూసారాన్ని పెంచుకునేందుకు రైతులు శ్రద్ధ చూపాలని కోరారు. సేంద్రియ ఎరువులు వాడకాన్ని పెంచుతూ భూమిలో పోషకాల సమతుల్యతను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, గ్రోమోర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మాచర్ల: పల్నాడు జిల్లాలో జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు సహకారంతో అన్వర్ బాషా ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఏర్పాట్లను శ్రీనివాస మహల్ థియేటర్ యజమాని జానీ పర్యవేక్షిస్తున్నారు. శనివారం క్రికెట్ పోటీలు బంగ్లా గ్రౌండ్‌లో నిర్వహించారు. నిర్వాహకులతోపాటు, క్రికెట్ అభిమానులు తిలకించారు.

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి



మాచర్ల రూరల్ : ప్రమాదవశాత్తూ నీటిలో పడి గొర్రెల కాపరి చనిపోయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తాళ్ళపల్లి గ్రామ సమీపంలోని సూరమ్మ చెరువులో గడ్డం శ్రీనివాసరావు (40) గొర్రెలను కడుగుతూ ప్రమాదవశాత్తూ జారి లోతైన కుంటలో పడి మరణించాడు. శ్రీనివాసరావు బెల్లంకొండ మండలం, వన్నయ్యపాలెం గ్రామానికి చెందినవాడు. పది నెలల క్రితం కొప్పునూరు గ్రామంలోని అత్తగారింటికి వచ్చి జీవాలు మేపుకుంటూ ఇక్కడే ఉంటున్నాడు. శ్రీనివాసరావుకు భార్య, పిల్లలున్నారు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని ఆదరణ అనాథ, వృద్ధుల ఆశ్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సందేపోగు రాజారావు భార్య సుజాత జయంతి సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. సుజాత కుమార్తె స్వప్న ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు సురేష్, మురారి గిరి తేజ, ఆశ్రమ నిర్వాహకులు రిషిత, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంట.. లాభమేనంట!

- వేరుశనగ, పత్తి చుట్టూ రక్షణకు అవసరం
- తెగుళ్ల నివారణకు ఎంతో ఉపయుక్తం



దొండేటి పాపకుమారి ఏవో, దాచేపల్లి

దాచేపల్లి: వాణిజ్య పంటల సాగులో అంతర పంటలను పండించటం అన్నదాతకు లాభసాటిగా ఉంటుంది. వాణిజ్య పంటలపైనే ఆధారపడకుండా ఉండొచ్చు. అంతర పంటతో భూసారం పెరిగి తెగుళ్ల బెడద తగ్గుతుంది. వర్షం ఆధారంగా ఒక ట్రెండు పంటలను నమ్ముకోవటం కంటే పంట మధ్యలో చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలకు చెందిన అంతర పంటలను సాగు చేయటం మెట్ట వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు సిద్ధమతుతున్నారు. అంతర పంటలు కూడా సాగు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాపకుమారి సూచించారు.

జాగ్రత్తలు ఇలా...

తేలికపాటి నేలల్లో వాలుకు అడ్డంగా దుక్కి దున్నిన తర్వాత విత్తుకుంటే నేలలో తేమశాతం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. వర్షాధారంగా అంతర పంటలు తప్పనిసరిగా వేయాలి. ఆరుతడి పంటలకు బోదే లేదా సాళ్ల లేదా ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవాలి. ఒకవేళ ఎక్కువ వర్షాలు వచ్చినా నీటిని బయటకు పంపడానికి అవకాశం ఉంటుంది. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను ఆరికట్టడానికి వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర విత్తనాలను తెగుళ్ల మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. పొలంగట్లపై కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దగ్గరగా ఒత్తుగా లేకుండా ప్రతి పంటలోనూ మొక్కల సాంద్రత పాటించాలి.

విత్తనాలు కీలకం...

వేరుశనగ సాగు చేసే రైతులు పొలాన్ని రెండు లేదా మూడుసార్లు దుక్కి చేసుకోవాలి. జులై మాసం అంతా విత్తుకునేందుకు అనుకూలం. కే-6, కే-9, కదిరి హరితాంధ్ర లాంటి విత్తన రకాలు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 నుంచి 60 కిలోల విత్తనాలు అవసరం. విత్తే ముందు కిలో విత్తనానికి ఒక మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేసిన తరువాత గ్రాము టెబుకొనజోల్, 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి పాటించాలి. పొలం చుట్టూ రక్షణ పంటలుగా సజ్జ, జొన్న నాలుగు నుంచి ఆరు వరుసలుగా విత్తుకుంటే కాండంకుళ్లు వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసం పీల్చు పురుగులు, తామర పురుగులను నివారించవచ్చు. 7:1 లేదా 11:1 లేదా 15:1 నిష్పత్తిలో వేరుశనగలో కంది లేదా సజ్జ పంటలు వేసుకోవాలి. విత్తే సమయం లేదా విత్తిన తర్వాత 20 నుంచి 30 రోజుల సమయంలో నీటి సంరక్షణ కోసం ప్రతి 3:6 మీటర్లకు ఒక తల్లిచాలు ఏర్పాటు చేసుకోవాలి.



సాగులో ఉన్న పిల్లిపెసర పంట



సాగు చేస్తున్న దోస పంట

■ కంది రైతులు తేలికపాటి నేల్లో మధ్యస్థ రకాలైన పీఆర్‌జీ-176, పీఆర్‌జీ-158 విత్తనాలు ఎంచుకోవాలి. బరువు నేలల్లో ఎక్కువ కాల పరిమితి రకాలైన ఎల్‌ఆర్‌జీ-41, ఎల్‌ఆర్‌జీ-52, ఎల్‌ఆర్‌జీ-105, టిఆర్‌జీ-59, ఐసీపీఎల్-85063, ఐసీపీఎల్-87119, బీఎస్ఎంఆర్-786 రకాలు ఎంపిక చేసుకోవాలి.

■ పత్తి సాగు విషయంలో ఎర్ర నేలల్లో జూన్ నుంచి జూలై వరకు విత్తుకొవచ్చును. నల్లరేగడి నేలల్లో జూలై నుంచి ఆగష్టు వరకు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. ఒక ప్రాంతంలో ఉన్న రైతులంతా దఫాలుగా కాకుండా వీలైతే స్వల్పకాల వ్యవధిలో ఒకేసారి విత్తుకుంటే తెగుళ్ళు, చీడపీడల నివారణ సులభమవుతుంది. బీటీ రకం విత్తనాలు ఎకరాకు 750 గ్రాములు నుంచి ఒక కిలో అవసరం. బీటీ రకం వేసుకుంటే పొలం చుట్టూ నాన్‌బీటీ పత్తి లేదా కంది పంట సాగు చేస్తే కాయ తొలుచు పురుగు ఉధృతిని ఆరికట్టవచ్చు. విత్తుకున్న 40 రోజులకు తప్పనిసరిగా ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా వేసిన ప్రాంతాల్లో పత్తి పంట ప్రస్తుతం మొలక దశలో ఉంటుంది. ఈ వాతావరణానికి వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉన్నందున 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి మొక్క వేరు మండలం తడిసేలా పోయాలి. ఈ సమస్య నివారణకు విత్తే సమయంలో కిలో విత్తనాలకు 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి చేయాలి.

■ వరి నారు మడులు పెంచుకునేందుకు జూన్ మాసం అనుకూలం. సాంబమసూరి, నంద్యాల సన్నాలు, నెల్లూరు సోనా, నెల్లూరు మసూరి, నంద్యాల సొనా, ఎంటీయూ-1212, ఎంటీయూ-1280, ఎంటీయూ-1281 లాంటి రకాలు బాగుంటాయి. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు నారుపోసే ముందు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేయాలి.

వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తత అవసరం



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కారెంపూడి : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా స్వచ్ఛమైన నీటిని తాగాలని, చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని జల్ జీవన్ మిషన్ మేనేజర్ పి.కిరణ్‌కుమార్ కోరారు. డయేరియా వంటి వ్యాధుల ఎలా వస్తాయో తెలుపుతూ అవగాహనా కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు శనివారం కారెంపూడిలో నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి గ్రామంలో అధికారులు అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్లో సదస్సు నిర్వహించారు. చేతులను శుభ్ర పరచుకునే విధానం గురించి విద్యార్థులకు డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎస్.కుమార రాజా, ఏఈ వి. వెంకటేష్, జిల్లా కోఆర్డినేటర్లు తేజ్ సంగీత్ రమేష్, నవీన్, ఈఓపీఆర్డీ కె. సత్యప్రసాద్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కె.సుబ్బారావు, పీహెచ్‌సీ సీహెచ్ఓ మల్లయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలి



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, ఎంపీపీ అల్లు సత్యవతి తదితరులు

పిడుగురాళ్ల రూరల్: మండల, గ్రామస్థాయిలోని ప్రజా సమస్యలను అధికారులు సమన్వయంతో పనిచేసి వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ వెంకయ్య, ఎంపీపీ అల్లు సత్యవతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు గత పురోగతిని, అభివృద్ధి ప్రణాళికలను వినిపించారు. ఈ సందర్భంగా వెంకయ్య, సత్యవతిలు మాట్లాడుతూ.... ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించారని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో అధికారుల పరిశీలన



పట్టణంలోని సమస్యలను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

మాచర్ల: పట్టణంలోని 18వ వార్డులో అధ్వానంగా మారిన పరిసరాలను పురపాలక సంఘం ఏఈ చంద్రశేఖర్, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి షేక్ షాహినాలు శనివారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. బోరు మరమ్మతులు, మంచినీటి సదుపాయాలు, వీధి దీపాల ఏర్పాటు, కాల్వల్లో పేరుకు పోయిన మురుగు తదితర అంశాలను అధికారులు తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డయేరియా పెరుగుతున్నందున ముందస్తుగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీరి వెంట కంభంపాటి అనిల్‌కుమార్, దుర్గారావు, స్థానికులు ఉన్నారు.

ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న ఎ.ఉదయభాను

మాచర్ల : మాచర్ల ప్రజలు డయేరియా బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఉదయభాను తెలిపారు. శనివారం ఆమె కమ్యూనిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డయేరియా వస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు చేతులు సబ్బులో కడగాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. బయట అపరిశుభ్రంగా ఉన్న ఆహార పదార్థాలు తినకూడదని చెప్పారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులకు అతిసార త్వరగా సోకే అవకాశం ఉందన్నారు. వీరంతా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. డయేరియా వచ్చినట్లు అనుమానం ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటి వరకు 150 డయేరియా కేసులు వచ్చాయని చెప్పారు. 86 మంది ఇన్‌పేషెంట్‌గా వైద్య సేవలు పొందినట్లు వెల్లడించారు. మరో ఐదుగురికి అత్యవసర చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. డయేరియా వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ కె.పి.చారి, డాక్టర్ జయప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



అప్పల నర్సమ్మను సన్మానిస్తున్న ఈఈ ప్రసాద్

విజయపురి సౌత్: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని ఏపీ జెన్కో ఈఈ వైఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రంలో ప్లాంట్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బత్తిన అప్పల నర్సమ్మ సన్మాన కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పల నర్సమ్మ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడం అభినందనీయం అన్నారు. అనంతరం ఉద్యోగులు అప్పల నర్సమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుడి జలవిద్యుత్ కేంద్రం డీఈ రాజారెడ్డి, ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రీజినల్ ప్రెసిడెంట్ సాంబశివ, రీజినల్ సెక్రటరీ సూరజ్ చంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తులు



సత్తెనపల్లి: పట్టణంలోని సబ్‌జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ శనివారం సందర్శించారు. ఖైదీలకు అందించే ఆహారం, స్టోర్ రూమ్‌లో సరకు నిల్వలు వంటి వాటిని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఖైదీలతో న్యాయసేవల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.వెంకట రత్నం, న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సబ్ జైల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కూడా వారు సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారికి పెడుతున్న భోజనం, ఇతర ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో పుస్తకాల గదికి తాళం



పుస్తకాలు నిల్వ ఉంచిన గది వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కోటా సాయికుమార్ తదితరులు



గదికి తాళం వేసిన ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఎస్ఎఫ్ఐ నాయకులు

పిడుగురాళ్ల: అక్రమంగా పుస్తకాలు నిల్వ ఉంచిన నారాయణ స్కూల్‌పై ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ మాట్లాడుతూ... కొన్ని రోజుల నుంచి తమకు అధిక ధరలకు పుస్తకాలను నారాయణ స్కూల్ యాజమాన్యం అమ్ముతున్నట్లు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. శనివారం ఉదయం వచ్చి చూడగా ఒక్క గదిలోనే అక్రమంగా వేల సంఖ్యలో పుస్తకాలు, టై, బెల్టు, యూనిఫాం వంటివి నిల్వ ఉంచారని తెలిసిందన్నారు. అంతేకాకుండా పాఠ్య పుస్తకాలు కూడా అమ్ముతున్నారని గుర్తించినట్లు తెలిపారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆయన వచ్చి నారాయణ స్కూల్ ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. అనంతరం పుస్తకాలు నిల్వ ఉన్న గదికి తాళం వేశారు. ఎంఈవో మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేయటంతో స్కూల్ వద్దకు చేరుకున్నామని, పుస్తకాలు నిల్వ ఉండటాన్ని గుర్తించి సంబంధిత గదికి తాళం వేశామని పేర్కొన్నారు.

మెగా లోక్ అదాలత్‌తో 58 కేసులు పరిష్కారం

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మురళీ గంగాధరరావు మాట్లాడుతూ... మొత్తం 58 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రూ. 87,01,581 నగదును కక్షిదారులకు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ బి. అచ్చారావు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్

మాచవరం: ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీడీఓ బి.సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు సమావేశం ద్వారా అభినందనలు తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేయూత అందించాలని ఆకాంక్షించారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమ విభాగ పనితీరును వివరించారు. సమావేశానికి ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షత వహించగా, జడ్పీటీసీ శివాయాదవ్, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా బాబు ఎన్నిక

దాచేపల్లి : దాచేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పరిమి బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెస్‌క్లబ్‌కు ఇప్పటివరకు అధ్యక్షుడు అయిన వినుకొండ అజయ్ కుమార్ అధ్యక్షతన దాచేపల్లిలో శనివారం సమావేశం జరిగింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా బాబు, గౌరవ అధ్యక్షుడిగా షేక్ పెంటుసాహెబ్, ఉపాధ్యక్షులుగా అంబటి మల్లికార్జునరావు, చెట్టిపొగు రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మోమిన్ సైదాసాహెబ్, సహాయ కార్యదర్శులుగా జాలె విజయ్‌కుమార్, గుండా మురళీధర్, కోశాధికారిగా చెట్టిపొగు కాశయ్యలను సభ్యులు ఎన్నుకున్నారు. జర్నలిస్ట్‌ల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని అధ్యక్షుడు బాబు చెప్పారు. అందరి సహకారంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలిపారు. నూతన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సీనియర్ సభ్యులు మాతంగి రాంబాబు, దుగ్గరాజు కృష్ణమూర్తి, అంబటి ఆంజనేయులు, బలుగూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.... వ్యాధులొస్తాయ్ భద్రం..!

- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- అంటువ్యాధులు ప్రబలే అవకాశం
- లక్షణాలు కనిపిస్తే సకాలంలో వైద్యం అవసరం
- నిర్లక్ష్యం చేయరాదని వైద్యుల సూచన

గురజాల: వర్షాకాలం అంటేనే అంటు వ్యాధులు ప్రబలే కాలం. ప్రధానంగా ఎక్కువ మంది అతిసార బారిన పడుతుంటారు. రోగులకు ఎంతో ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ వ్యాధికి సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటే ఈ డయేరియా రాదు. అపరిశుభ్రత కారణంగా వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. మరోవైపు దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు కూడా ప్రబలే అవకాశం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమ తెరలు వాడటం, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవడం, పాత వస్తువులు, పగిలిన సామగ్రిలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. జ్వరాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలి.

డయేరియా లక్షణాలు

ఈ వ్యాధి వచ్చిన వారిలో విరేచనాలు ప్రధానంగా కనిపిస్తుంటాయి. నీళ్లలా, పలచగా అవుతుంటే డయేరియా అని అర్థం. కలుషితమైన నీటిని తాగడం, అపరిశుభ్ర ఆహారాన్ని తినడం వల్ల విరోచనాలు అవుతాయి. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కల నొప్పులు రావడం వంటివి కనిపిస్తుంటాయి. శరీరంలో డీహైడ్రేషన్ అయ్యే పరిస్థితులు వస్తాయి. శరీరం ఎండిపోవడం, నాలుకపై తడి లేకుండా పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ ఇలా....

చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, బయట ప్రాంతాల్లో ఆహారం తినకపోవడం మంచిది. ఉడికీ ఉడకని మాంసాహారాన్ని తినడం వంటివి చేయరాదు. పరిసరాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

నిర్లక్ష్యం వద్దు



డయేరియా వస్తే నిర్లక్ష్యం వహించరాదు. డయేరియా రావడానికి ముఖ్య కారణం కలుషిత ఆహారం, నీరు. విరోచనాలు అయితే తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి. ఎవరూ నిర్లక్ష్యం చేయరాదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు ఉండొచ్చు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అవసరం. తగిన జాగ్రత్తలు పాటించాలి.

– పద్మావతి, మాదుగుల వైద్యురాలు